ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 28.11.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలపై స్టే ఇచ్చేందుకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈ రోజు నిరాకరించింది. ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని పిటిషనర్లకు హైకోర్టు స్పష్టం చేసింది.

2. విదేశాలతో పోటీ పడేలా, రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ' డాక్యుమెంట్ ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

3. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటు సభ్యులు పార్టీలకతీతంగా ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అఖిల పక్ష ఎంపీల సమావేశంలో సూచించారు.

4. పంచాయతీ ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------------------

**హైకోర్టు**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై జారీ చేసిన జీవో 46ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక

తాము జోక్యం చేసుకోలేమని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన తరువాత, మళ్లీ తామే స్టే ఇవ్వలేమని పిటిషనర్‌కు సూచించింది. అనంతరం ఈ రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

పిటిసి, హైదరాబాద్

---------------------------

**రేవంత్**

విదేశాలతో  పోటీ పడేలా, రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ' డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర యువతలో నైపుణ్యాలను తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ..  ఇలా మూడు రీజియన్లుగా విభజించుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో నిన్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025'పై సమీక్షలో అధికారులు పాలసీ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి  మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచడంతోపాటు ఇక్కడ పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను సదస్సు జరిగే రెండు రోజుల్లో ప్రదర్శించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్.. రాష్ట్ర భవిష్యత్తుకు సమగ్ర మార్గరూపం అని అన్నారు.

జీఎస్

-------------------------------------

**భట్టి**

ఎంపీలు పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాలపై ప్రధాని, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిన్న

అఖిలపక్ష ఎంపీలతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చే అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావించాలని కోరారు. ప్రధానమంత్రి సమయం ఇస్తే ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమానికి కేంద్ర మంత్రులను, ఎంపీలను ఆహ్వానిస్తామని ఆయన చెప్పారు.

జీఎస్

--------------------------------

**శ్రీధర్ బాబు**

విదేశీ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూల గమ్యస్థానమని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో ఐటీ, ఏరోస్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫార్మా రంగాలకు మంచి ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేశామన్నారు. జర్మన్ ఫ్రీడరిక్- ఎబర్ట్- స్టిఫ్టంగ్ ఫౌండేషన్ ప్రతినిధులు నిన్న సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలుచేస్తున్న సులభతర పారిశ్రామిక విధానాలను, సంక్షేమ పథకాలను మంత్రి వివరించారు. జర్మనీ-తెలంగాణ భాగస్వామ్యంలో వాణిజ్యం, పరిశ్రమల ఏర్పాటుకు తమ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్

--------------------------

**కోమటిరెడ్డి**

రాష్ట్ర అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యానికి తీసుకెళ్లే బాధ్యత ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, ఇంజినీర్లపై ఉందన్నారు. గ్లోబల్ సమిట్‌లో రోడ్లు-భవనాల శాఖ విజన్-2047పై అధికారులు హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ ప్రధాన కార్యాలయంలో నిన్న పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం జరిగిన సమీక్షలో

మంత్రి మాట్లాడారు. హ్యామ్, ఆర్‌ఆర్‌ఆర్, ఓఆర్‌ఆర్ నుంచి రేడియల్ రోడ్లు రాష్ట్ర ముఖ చిత్రాన్ని మారుస్తాయన్నారు. వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లి విమానాశ్రయాల ఏర్పాటు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

జీఎస్

-----------------------------

**MANN KI BAAT:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ, విదేశాల ప్రజలతో తన ఆలోచనలను పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం ఎల్లుండి ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమవుతుంది. ఇది నెలవారీ రేడియో కార్యక్రమంలో 128వ సంచిక. ఈ కార్యక్రమం మొత్తం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్, AIR న్యూస్ వెబ్‌సైట్, న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం అవుతుంది. అలాగే, AIR న్యూస్, DD న్యూస్, PMO, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ YouTube ఛానెల్‌లలో కూడా మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. హిందీలో ప్రసారం అయిన తర్వాత ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషలలో ప్రసారం చేస్తుంది.

**NSD**

------------------------------

**ఐఐటీ**

వచ్చే నెల 4 నుండి 6 వరకు దేశంలోనే అతిపెద్ద మెటలర్జిస్టులు, మెటీరియల్ శాస్త్రవేత్తల సమావేశాలకు IIT-హైదరాబాద్ క్యాంపస్ ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రముఖ నిపుణులు, పరిశోధకుల ప్రజెంటేషన్ల ద్వారా ఈ సమావేశం పరిశ్రమ-విద్యా సంబంధాలను మరింతగా పెంచుతుందని IIT-హైదరాబాద్ డైరెక్టర్, అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి అన్నారు. నిన్న రాత్రి హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో IIM 79వ వార్షిక సాంకేతిక సమావేశం, శక్తి పరివర్తన కోసం అధునాతన పదార్థాలు, కీలకమైన ఖనిజాలపై అంతర్జాతీయ సమావేశం జరుగుతాయని ఆయన అన్నారు. సుమారు 1600 మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తారని ఆయన అన్నారు. 14 సమాంతర సెషన్లలో 400 కంటే ఎక్కువ మౌఖిక ప్రదర్శనలు ఉంటాయి.

(సౌండ్‌బైట్- ప్రొఫెసర్ మూర్తి)

IIM వైస్ ప్రెసిడెంట్, మిశ్రా ధాతు నిగమ్ CMD డాక్టర్ S.V.S. నారాయణ మూర్తి మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు స్వీయ-స్థిరత్వాన్ని పెంపొందించడానికి వాటాదారుల మధ్య అర్థవంతమైన చర్చలకు వేదికను ఏర్పాటు చేస్తాయని అన్నారు.

ఎన్ఎస్డీ

---------------------------

**నిలిపివేత**

తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ వార్డులు, సర్పంచుల ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఒక స్థానానికి ఒకే అభ్యర్థి నామినేషన్ వేసిన పక్షంలో అక్కడ పదవుల వేలంపాట, ఒత్తిడి, ప్రేరణ, బెదిరింపు, బలవంతపు ఉపసంహరణలు జరిగినట్లు ఏవైనా ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి, నిజమని తేలితే ఫలితాలను ప్రకటించవద్దని సూచించింది. ఫిర్యాదులు రాని పక్షంలో నామినేషన్లు ఉపసంహరించుకున్న, ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు రాయించుకున్న తర్వాతే ఫలితాలు వెల్లడించాలని సూచించింది.

జీఎస్

--------------------------

**కమిషన్**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తమ ఫిర్యాదులను దాఖలు చేసే వారి కోసం 'గ్రీవెన్స్ మాడ్యూల్'ను ప్రారంభించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో ఈ సదుపాయం కల్పించింది. ఫిర్యాదులను, వాటి పురోగతిని కూడా ట్రాక్ చేయవచ్చు. ఈ చొరవ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రజలను చురుకుగా పాల్గొనేలా చేయడం ద్వారా పారదర్శక,

జవాబుదారీ ఎన్నికలను ప్రోత్సహిస్తుందని, వారిలో బాధ్యతాయుత భావాన్ని పెంపొందిస్తుందని కమిషన్ పేర్కొంది.

ఎన్ఎస్డీ

------------------------------

**నిలిపివేత**

వరంగల్ జిల్లా, మహమూద్ పట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం ఆరుగురు ఎస్టీ జనాభా ఉన్న గ్రామంలో రిజర్వేషన్లలో ఎస్టీకి సర్పంచ్ పదవితో పాటు మూడు వార్డులు కేటాయించడం పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్ విచారించిన హైకోర్టు.. ఎన్నికను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 576 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామంలో ఎస్టీలు కేవలం ఆరుగురు మాత్రమే ఉండగా మూడు వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ పదవిని కూడా ఎస్టీలకు రిజర్వ్ చేశారు.

పిటిసి, వరంగల్

-------------------------------

**యాప్**

Te-Poll మొబైల్ అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఇందులో ఓటర్లకు సంబంధించిన అన్ని వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ స్లిప్ డౌన్ లోడ్, పోలింగ్ కేంద్రం సమాచారం, ఫిర్యాదులు చేసే అంశాలు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు.

పిటిసి, సిరిసిల్ల

---------------------------

**పోలీస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ తరఫున కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఒక

ప్రకటనలో తెలిపారు. 22 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 6 స్టాటిక్ సర్వేలయన్స్ బృందాలు, 6 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను, 4 అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

---------------------------

**పరిశీలకులు**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్రా లక్ష్మి అన్నారు. మొదటి విడత నామినేషన్ల ఏర్పాట్లు, నామినేషన్ ల స్వీకరణ కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. అంతరం జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి పాల్గొన్నారు.

పిటిసి, నల్గొండ

---------------------------------

**చెక్ పోస్టులు**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు, జిల్లా ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. పలు చెక్ పోస్ట్ లను ఎస్పీ నిన్న రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చ రించారు.

పిటిసి, సిరిసిల్ల

--------------------------------